సాక్షి
పెద్దపల్లి
గురువారం ၊ 15 ၊ జూన్ ၊ 2023





**పత్తి క్వింటాల్‌కు రూ.6,988**

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌లో పత్తి క్వింటాల్‌కు ధర రూ.6,988 పలికింది. కనిష్టం రూ.6,029, సరాసరి రూ.6,695గా నమోదైంది.



**అయ్యో బిడ్డలారా..**

వేసవి సెలవుల కోసం బంధువుల ఇంటికి వెళ్లిన ఇద్దరు చిన్నారులు మానేరువాగులో మునిగి మృత్యువాత పడడం స్థానికంగా విషాదం నింపింది.

4లో▸

**వాతావరణం**

గరిష్ఠం/కనిష్ఠం
43.0/31.0

ఆకాశం ఉదయం నిర్మలంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### నాడు వైస్సార్.. నేడు కేసీఆర్



న్యూట్రిషియన్ కిట్ అందిస్తున్న జెడ్పీ చైర్మన్

మంథని: దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర రెడ్డి తర్వాత ప్రజల ఆరోగ్యం కోసం పనిచేస్తున్న వ్యక్తి సీఎం కేసీఆర్ మాత్రమేనని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంథనిలోని మాతా శిశు ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన ఆరోగ్య దినోత్సవంలో అడిషనల్ కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రులపై నేడు నమ్మకం పెరిగిందన్నారు. మోసగాళ్ల మాటలు నమ్మవద్దని, ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వం, నాయకులను గుర్తించాలన్నారు. సర్పంచ్ బీముని పుష్ప, ఎంపీపీ కొండ శంకర్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్ కంది శ్రీనివాస్‌రెడ్డి, గద్దలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు శంకరాదేవి ఉన్నారు.

### 50 పడకల ఆసుపత్రికి ప్రతిపాదనలు



వైద్యులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

సుల్తానాబాద్: సుల్తానాబాద్‌లోని 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని 50 పడకలకు పెంచేందుకు ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు ఎంపీపీ బాలాజీ రావు తెలిపారు. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా స్థానిక ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. బాలింతలకు కేసీఆర్ కిట్లను అందించారు. ఆసుపత్రికి రోగుల తాకిడి పెరుగుతోందని, వైద్యుల పనితీరుకు ఇది నిదర్శనమని పేర్కొన్నారు. డాక్టర్ రమాదేవితోపాటు సిబ్బందిని సన్మానించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత, వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమత, ఏఎంసీ చైర్‌పర్సన్ బుర్ర మౌనిక, కౌన్సిలర్లు హనుమండ్ల అరుణ, గొట్టం లక్ష్మి, వైద్యులు మహేందర్, శ్రీధర్, సునీత సిబ్బంది ఉన్నారు.

### దేశంలోనే నంబర్ వన్‌గా నిలవాలి



వాటర్ బాటిల్ తయారీ యంత్రాన్ని ప్రారంభిస్తున్న సత్యనారాయణరావు

సుల్తానాబాద్: సుల్తానాబాద్ సహకార సంఘం దేశంలోనే నంబర్ వన్‌గా నిలవాలని కేడీసీసీ బ్యాంకు సీఈవో సత్యనారాయణరావు తెలిపారు. సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ బాటిల్ తయారీ యంత్రాన్ని బుధవారం ప్రారంభించారు. సుల్తానాబాద్ సొసైటీ అభివృద్ధిలో ఉమ్మడి జిల్లాలోనే మొదటిస్థానంలో ఉందని, దీనిని చూడడానికి వివిధ రాష్ట్రాల ప్రతినిధులు వచ్చి అధ్యయనం చేస్తున్నారని తెలిపారు. సహకార సంఘం ఆధ్వర్యంలో నడుస్తున్న సూపర్‌మార్కెట్, ఫర్టిలైజర్, సీడ్స్ లాభాల బాటలో ఉన్నాయన్నారు. భవిష్యత్తులో పెట్రోల్ బంక్ ప్రారంభిస్తామన్నారు. సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, జిల్లా సహకార అధికారి జాన్ వెస్లీ, రిసోర్స్ పర్సన్ సత్యనారాయణ, కేడీసీసీబీ సుల్తానాబాద్ శాఖ మేనేజర్ శశిధర్‌రావు, సూపర్‌వైజర్ సాగర్ రెడ్డి, సెక్రెటరీ బూర్గు సంతోష్ కుమార్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

### మొక్కలు నాటుదాం..



మొక్కలు నాటుతున్న ఈడీ సునీల్‌కుమార్

జ్యోతినగర్: చెట్లు నాటుదాం.. పచ్చదనం పెంచుదామని ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని బాలికా సాధికారత మిషన్–2023లో శిక్షణ పొందుతున్న బాలికలతో కలిసి టౌన్‌షిప్‌లో మొక్కలు నాటారు. సంరక్షిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. జీఎంలు ప్రసేంజిత్ పాల్, దేశాయ్, మోహన్‌రెడ్డి, అనిల్‌కుమార్, ఠాగూర్, తపస్ సాహ, ఏజీఎం(హెచ్ఆర్) బిజయ్‌కుమార సిగ్దర్, దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు ఉషాకుమార్, ఉద్యోగ గుర్తింపు సంఘం ప్రధాన కార్యదర్శి మల్లయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటస్వామి పాల్గొన్నారు.

# కోడిగుడ్లపై ముద్ర



సుల్తానాబాద్: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం కోసం ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందిస్తోంది. కోడిగుడ్లు పక్కదారి పడుతున్నాయన్న ఆలోచనతో వాటిపై అంగన్‌వాడీ కోడిగుడ్లు పేరిట లోగో ముద్రించి, ఆయా సెంటర్లకు కాంట్రాక్టర్ ద్వారా సరఫరా చేయాలని నిర్ణయించింది. జిల్లామొత్తంగా 706 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి ఆధ్వర్యంలో ప్రభుత్వం నెలనెలా కోడిగుడ్లు, ఇతర పౌష్టికాహార సరుకులను లబ్ధిదారులకు పంపిణీ చేస్తోంది. ప్రతి కోడిగుడ్డుపై 'అంగన్‌వాడీ గుడ్డు' అని ముద్ర వేస్తున్నారు. ఈ నెల నుంచే వాటిని లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నారు.

- పక్కదారి పట్టకుండా ఉండేందుకు సర్కారు నిర్ణయం
- ఈ నెల నుంచే లబ్ధిదారులకు పంపిణీ
- జిల్లాలో 706 కేంద్రాలు

**సరుకులు పక్కదారి అంటూ ఆరోపణలు**

అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరిన మూడేళ్లలోపు చిన్నారులకు బాలామృతం, గుడ్లు, ఆరేళ్లలోపు పిల్లలకు గుడ్లు, పప్పు, కూరగాయల భోజనం, కుర్‌కురే అల్పాహారం, పల్లీ పట్టీలు, ఆరోగ్యలక్ష్మి పథకంలో ప్రతిరోజూ 200 మి.లీ. పాలు అందిస్తున్నారు. బరువు తక్కువగా, బలహీనంగా ఉన్న వారికి రెట్టింపు పౌష్టికాహారం ఇస్తున్నారు. అయితే అధికారులు తక్కువ మంది ఉండటంతో పర్యవేక్షణ అంతంతమాత్రంగానే ఉంటోంది. దీంతో సిబ్బంది సరుకులను పక్కదారి పట్టించి, సొమ్ము చేసుకుంటున్నారని పలువురు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎలాంటి తీసుకోవడం లేదన్న విమర్శలున్నాయి. అంగన్‌వాడీ లబ్ధిదారులకు కోడిగుడ్లు నెలవారిగా పంపిణీ చేయకపోవడంతో చెడిపోతున్నాయి. కోడిగుడ్లపై లోగో ముద్రిస్తుండటంతో పక్కదారి పట్టే అవకాశం ఉండదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**మూడు విడతల్లో మూడు రంగులు**

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల్లో 701 ప్రధాన, 05 మినీ కేంద్రాలున్నాయి. వీటిల్లో మూడేళ్లలోపు పిల్లలు 15,162 మంది, మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులు 9,015 మంది, గర్భిణులు 3,578 మంది, బాలింతలు 4,078 మంది నమోదయ్యారు. వీరికి కోడిగుడ్ల పంపిణీలో అక్రమాలను నియంత్రించేందుకు ప్రభుత్వం ప్రత్యేక విధానం అమలు చేస్తోంది. నెలలో పది రోజులకోసారి గుడ్లపై ప్రత్యేక రంగుతో కూడిన ముద్ర వేస్తోంది. మొదటి విడతలో నీలి, రెండో విడతలో ఎరుపు, మూడో విడతలో ఆకుపచ్చ రంగుల్లో »అంగన్‌వాడీ గుడ్డు« మధ్యలో జోన్–1 అని ముద్రిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఐదు జోన్ల పరిధిలో కాంట్రాక్టర్లకు బాధ్యతలు ఇచ్చారు.

**లబ్ధిదారులకే అందాలని..**



అంగన్‌వాడీ కేంద్రాల్లో పేరు నమోదు చేసుకున్నవారికి ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తోంది. సరుకులు లబ్ధిదారులకే అందాలన్న లక్ష్యంతో ఇటీవల కోడిగుడ్లపై లోగోను ముద్రించి, పంపిణీ చేస్తోంది. చిన్నారులు, బాలింతలు, గర్భిణుల ఆరోగ్యం కోసం నెలనెలా కోడిగుడ్లు ఇస్తున్నాం. ఈ నెల నుంచే ముద్ర ఉన్న గుడ్లను పంపిణీ చేస్తున్నాం.

– రవూఫ్‌ఖాన్, జిల్లా సంక్షేమ అధికారి

# వైద్య కళాశాలతో మెరుగైన సేవలు



న్యూట్రిషియన్ కిట్స్ అందిస్తున్న రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్, కలెక్టర్ సంగీత

- అందుబాటులోకొచ్చిన డయాలసిస్ యంత్రాలు
- కలెక్టర్ సంగీత, రామగుండం ఎమ్మెల్యే చందర్

జ్యోతినగర్: రామగుండంలో వైద్య కళాశాల ఏర్పాటుతో మెరుగైన సేవలు అందే అవకాశముందని కలెక్టర్ సంగీత, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తెలిపారు. రాష్ట్ర్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం లక్ష్మీనర్సింహ గార్డెన్స్‌లో బుధవారం నిర్వహించిన వైద్య ఆరోగ్య దినోత్సవంలో పాల్గొన్నారు. ఆరు దశాబ్దాల్లో సాధ్యంకానీ అభివృద్ధిని సీఎం కేసీఆర్ తొమ్మిదేళ్లలో చేసి చూపించారని తెలిపారు. రామగుండం వైద్య కళాశాలకు 32 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు,15 మంది ప్రొఫెసర్లను నియమించారని పేర్కొన్నారు. అనంతరం కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ పథకాన్ని ప్రారంభించారు. ఆరోగ్య మహిళా కేంద్రాల ద్వారా మహిళలకు ప్రత్యేక పరీక్షలు చేస్తున్నామని వివరించారు. గోదావరిఖని, పెద్దపల్లిలో డయాలసిస్ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. 134 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా అందించేందుకు డయాగ్నస్టిక్ హబ్ ఏర్పాటు చేశామన్నారు. రామగుండం ప్రాంతానికి చెందిన శివ యాదవ్ తన చిన్న కుమారుడికి గుండెలో రంధ్రం పడిందని, రేషన్‌కార్డులో అతడి పేరులేదని, ఆరోగ్యశ్రీ వర్తింపజేయాలని కోరగా వైద్య సహాయానికి కలెక్టర్ హామీ ఇచ్చారు. డీఎంహెచ్‌వోకు ఆదేశాలు జారీ చేశారు. వైద్య కళాశాల విద్యార్థినుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మేయర్ అనిల్ కుమార్, డీఎంహెచ్‌వో ప్రమోద్ కుమార్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు సింగ్, మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్ పాల్గొన్నారు.



మెడికల్ సిబ్బంది బతుకమ్మ ఆటలు

**కార్మికులే నా బలగం..**

గోదావరిఖని: సింగరేణి కార్మికులే తన బలగమని ఎమ్మెల్యే చందర్ తెలిపారు. దశాబ్ది ప్రగతి యాత్రలో భాగంగా బుధవారం ఆర్జీ–1 ఏరియా జీడీకే–2ఏ గనిపై ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో మాట్లాడారు. సమైక్య పాలనలో పోయిన వారసత్వపు హక్కును పునరుద్ధరించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. ప్రజల బాగు కోసం పోరాడింది బీఆర్ఎస్ పార్టీ ఒక్కటే అన్నారు. సమావేశంలో టీబీజీకేఎస్ నాయకులు గండ్ర దామోదర్‌రావు, దొరగండ్ల మల్లయ్య, వడ్డేపల్లి శంకర్, పుట్ట రమేశ్, దూట శేషగిరి, జనగామ శ్రీనివాస్‌గౌడ్, కుశ్నపల్లి శంకర్, దాసరి నర్సయ్య, గండు శ్రావణ్, ముదిగిరి మల్లేశ్, దాసరి శ్రీనివాస్, పొలాడి శ్రీనివాసరావు, అయాజ్, కొమురయ్య, గండ్ర రాజు, కార్పొరేటర్ అడ్డాల గట్టయ్య పాల్గొన్నారు.

**జీజీహెచ్‌లో పండ్లు పంపిణీ**

కోల్‌సిటీ: స్థానిక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఎమ్మెల్యే పండ్లు పంపిణీ చేశారు. ఆస్పత్రిలోని ఉచిత వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ దయాల్ సింగ్, డిప్యూటీ సూపరింటెండెంట్ అశోక్, ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

# అందుబాటులోకి సర్కారు వైద్య సేవలు



జిల్లాకేంద్రంలో న్యూట్రిషియన్ కిట్లను అందిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు

- సేవలందించడంలో తెలంగాణదే అగ్రస్థానం
- ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ

పెద్దపల్లిరూరల్: 'నేను రానుబిడ్డో సర్కార్ దవఖానాకు.. అనే పాత కాలంనాటి మాటకు అర్థాన్ని మార్చి నేను సర్కార్ దవఖానాకే పోతా.. అని ధైర్యంగా ప్రజలంతా చెప్పుకునే స్థాయికి ప్రభుత్వ ఆసుపత్రులు చేరాయని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. సీఎం కేసీఆర్ సారథ్యంలోని సర్కార్ ఆసుపత్రులు ఆధునీకరణకు నోచుకున్నాయని తెలిపారు. దశాబ్ది వేడుకల్లో భాగంగా బుధవారం జిల్లాకేంద్రంలో వైద్య ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. మహిళల కోసం ఆరోగ్య మహిళ కార్యక్రమాలను చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వాసుపత్రిలో డయాలసిస్, డయగ్నస్టిక్ కేంద్రాలను అందుబాటులోకి తెస్తామన్నారు. బ్లడ్‌బ్యాంకులో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సందర్శించారు. ఎక్కువసార్లు రక్తదానం చేసిన వారిని అభినందించారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్, మార్కెట్ కమిటీ చైర్మన్ జడల సురేందర్, డీసీహెచ్ఎస్ శ్రీధర్, డాక్టర్ వాసుదేవరెడ్డి, శౌరయ్య తదితరులున్నారు.

### గిరిజనుల అభివృద్ధికి ప్రాధాన్యం



ఆలయానికి భూమిపూజ చేస్తున్న మంత్రి

ధర్మారం: గిరిజనుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మండలంలోని బంజేరుపల్లి తండాలో గిరిజనుల ఆరాధ్య దేవత సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. తండాలను ప్రత్యేక పంచాయతీలుగా గుర్తించింది కేసీఆర్ ప్రభుత్వమేనన్నారు. సేవాలాల్ జయంతికి ప్రభుత్వం రూ.కోటి కేటాయించిందన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, తండాల సర్పంచు భూక్య చంద్రనాయక్, ఎంపీటీసీ భూక్య సరిత, తిరుపతినాయక్, రూప్లా నాయక్, ఎంపీడీవో జయశీల పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వహణకు సిద్ధం కావాలి

- ఓటరు జాబితాలో పొరపాట్లు ఉండొద్దు
- అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధతపై వీడియోకాన్ఫరెన్స్
- హాజరైన కలెక్టర్ సంగీత, సీపీ రెమా రాజేశ్వరి



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, సీపీ, అధికారులు

పెద్దపల్లిరూరల్: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో వాటి నిర్వహణకు సిద్ధమయ్యేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్లతో బుధవారం డీజీపీ అంజనీకుమార్‌తో కలిసి హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని, రెండో ఓటరు జాబితా రూపకల్పన కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలన్నారు. బూత్‌స్థాయి, వీఆర్‌ఓలకు బీఎల్‌ఓ యాప్‌పై అవగాహన కల్పించాలన్నారు. పోలింగ్ కేంద్రాలు రూట్‌మ్యాప్‌తో కూడిన మ్యాపింగ్ సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈవీఎం, వీవీప్యాట్‌ల ఫస్ట్ లెవల్ చెకింగ్ పూర్తి చేయాలన్నారు. ప్రతి పోలింగ్‌బూత్ వద్ద వెబ్ కాస్టింగ్ ఉండాలని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బందోబస్తు ఏర్పాటుకు పక్కా ప్రణాళిక ఉండాలన్నారు. కలెక్టర్ సంగీత, సీపీ రెమా రాజేశ్వరి, అడిషనల్ కలెక్టర్లు లక్ష్మీనారాయణ, కుమార్‌దీపక్, డీసీపీ వైభవ్‌గైక్వాడ్, ఎన్నికల డీటీ ప్రవీణ్ తదితరులున్నారు.

# బతుకులు 'బూడిద' పాలు

- గ్రామాలను కప్పేస్తున్న ఎన్టీపీసీ బూడిద
- ఇళ్ల పరిసరాలన్నీ నిండిపోతున్న వైనం
- ఒంటిపై పడుతుండడంతో అనారోగ్యాలు
- ఈదురుగాలులతో మరింత ఇబ్బంది





పేరుకుపోయిన బూడిదను తొలగిస్తున్న మహిళ



గ్రామాలవైపు ముంచుకొస్తున్న బూడిద

రామగుండం: ఎన్టీపీసీ బూడిద.. ఈ పేరు వింటేనే సమీప గ్రామాల ప్రజలు బెంబేలెత్తుతున్నారు. నాలుగు రోజులుగా వీస్తున్న ఈదురుగాలులకు అక్బర్‌నగర్, కుందనపల్లి గ్రామాలు బూడిదతో నిండిపోతున్నాయి. అంతర్గాం మండల పరిధిలోని ఎన్టీపీసీ ప్రభావిత గ్రామాలైన కుందనపల్లి, అక్బర్‌నగర్‌ను ఏటా మే, జూన్ మాసాల్లో ఎన్టీపీసీ బూడిద కప్పేస్తుంది. ఈదురుగాలులకు చెరువు నుంచి లేచి.. గ్రామాలను చుట్టుముట్టుతుండడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఎన్టీపీసీ యాజమాన్యం బూడిద చెరువులో కొన్ని ప్రాంతాల్లో స్ప్రింక్లర్లు ఏర్పాటు చేసి బూడిద లేవకుండా చర్యలు తీసుకుంటున్నప్పటికీ మిగిలిన ప్రాంతాల్లో మాత్రం ఇంటి పరిసరాలు, వంటగదిలో పాత్రలపై బూడిద చేరుతోంది. శుభకార్యాల సమయంలో ఈదురుగాలులు వేస్తే ఆహారపదార్థాల్లో బూడిద పడి వృథాగా బయటపడేయాల్సి వస్తోంది. కొన్నిసార్లు నీరు కూడా కలుషితమై తాగలేని పరిస్థితి నెలకొంటుంది.

### ఎప్పుడూ ఇదే గోస



ఈదురుగాలులకు బూడిద లేచి ఇళ్లలోకి చేరుతోంది. వస్తువులన్ని బూడిదతో నిండిపోతున్నాయి. ఒళ్లంతా దురద, వెంట్రుకలు రాలిపోతున్నాయి. ఎండా కాలం వచ్చిందంటే చాలు మా బాధలు వర్ణణాతీతం. ఎన్టీపీసీ అధికారులు మా ఇళ్లను పరిశీలించాలి.

– గద్దం స్వప్న, హార్మోనియంకాలనీ

### ఆరోగ్య సమస్యలొస్తున్నాయి



బూడిద కళ్లు, నోరు, ముక్కు, తలపై పడుతుండడంతో అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. మంచినీరు కొనుక్కుని తాగాల్సి వస్తోంది. ఇంటిని ఒక్క రోజు కడగకున్నా.. మొత్తం బూడిద కనిపిస్తుంది. వేసుకున్న దుస్తులన్నీ బూడిదమయంగా మారుతున్నాయి. అధికారులు స్పందించాలె.

– మిర్యాల భీమమ్మ, అక్బర్‌నగర్‌కాలనీ

### యాజమాన్యం స్పందించాలి



బూడిద చెరువుతో రెండు గ్రామాల ప్రజలు నరకం అనుభవిస్తున్నారు. బూడిదను విక్రయిస్తున్న ఎన్టీపీసీ యాజమాన్యం తద్వారా వచ్చే ఆదాయాన్ని ప్రభావిత గ్రామాల సంక్షేమానికి వినియోగించాలి. ఈదురుగాలులకు బూడిద లేవకుండా ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలి.

– కొండల రాజేందర్, కుందనపల్లి

# ప్రభుత్వ బడుల్లో రాగి జావ

- ఈనెల 20న ప్రారంభానికి కసరత్తు
- జిల్లాలో 40 వేల మందికి లబ్ధి
- ఇప్పటికే మెనూ మార్చిన ప్రభుత్వం

సుల్తానాబాద్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రాగిజావ పంపిణీకి ప్రభుత్వం నిర్ణయించింది. వారికి పౌష్టికాహారం అందించేందుకు సిద్ధమైంది. పిల్లలు ఎత్తుకు తగిన బరువు లేకపోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గతేడాది సర్వే చేపట్టాయి. అందులో విద్యార్థులు బలహీనంగా ఉన్నట్లు గుర్తించాయి. సమస్యను అధిగమించేందుకు ప్రతి విద్యార్థికీ రాగిజావ అందించాలని నిర్ణయించాయి. ఈ విధానంతో విద్యార్థులు కడుపు మాడ్చుకునే అవసరం ఉండదు. ఇప్పటికే ప్రభుత్వం మధ్యాహ్న భోజనం మెనూలో వెజిటబుల్ బిర్యానీని చేర్చగా.. ఉదయం రాగిజావ అందించేలా చర్యలు చేపట్టింది. కొన్నిసార్లు విద్యార్థులు అల్పాహారం తీసుకోకపోవడంతో రక్తహీనత, పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. తరగతి గదుల్లో నీరసంగా, చదువుపై ఆసక్తి పెంచుకోవడం లేదు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈనెల 20న జరిగే విద్యా దినోత్సవం నుంచే అమలుకు విద్యాశాఖ ముందుకొస్తోంది. ఈ విధానంతో జిల్లాలోని 540 ప్రభుత్వ పాఠశాలల్లోని దాదాపు 40 వేల మంది విద్యార్థులకు మేలు జరగనుంది.

### పేద పిల్లలకు ప్రయోజనకరం

ఉదయం ఖాళీ కడుపుతో వచ్చే విద్యార్థులకు రాగిజావ అందించడం మంచి నిర్ణయం. ఇప్పటికే పలు పాఠశాలల్లో కొందరి దాతలతో రాగిజావ అందిస్తున్నారు. ప్రభుత్వం పూర్తిస్థాయిలో పంపిణీ చేయాలని నిర్ణయించడంతోపాటు మధ్యాహ్న భోజన మెనూలోనూ వెజిటబుల్ బిర్యానీని చేర్చారు. దీంతో విద్యార్థులకు పోషకాహారం అంది చదువుపై పూర్తిస్థాయిలో శ్రద్ధ చూపుతారు. విద్యార్థుల సంఖ్య కూడా పెరగనుంది.

– సారయ్య ,ఉపాధ్యాయుడు, సుల్తానాబాద్

### నేడు తెలంగాణ పల్లెప్రగతి దినోత్సవం

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గురువారం తెలంగాణ పల్లె ప్రగతి దినోత్సవం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సంగీత తెలిపారు. ఆదర్శంగా నిలిచిన పల్లెలు సాధించిన ప్రగతి తెలిపేలా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

### పలువురు సీఐల బదిలీ

గోదావరిఖని: రామగుండం కమిషనరేట్ పరిధిలోని పలువురు సీఐలను బదిలీ చేస్తూ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం ఆదేశాలు జారీ చేశారు. రామగుండం సీసీఎస్‌లో పనిచేస్తున్న శ్రీనివాసరావు తాండూర్‌కు, శ్రీరాంపూర్ సీఐ వి.రాజు రామగుండం లీగల్‌సెల్‌కు బదిలీ అయ్యారు. ఆసిఫాబాద్ స్పెషల్ బ్రాంచ్ నుంచి పొన్నం సత్యనారాయణ సీసీఎస్ రామగుండంకు బదిలీ అయ్యారు.

## క్లుప్తంగా

### అతిథి గృహానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న దాతలు

ఓదెల: ఓదెల మల్లికార్జునస్వామి భక్తుల కోసం ఆధునిక సౌకర్యాలతో గెస్ట్‌హౌస్ నిర్మించనున్నట్లు ఆలయ చైర్మన్ మేకల మల్లేశంయాదవ్ తెలిపారు. కాంట్రాక్టర్ జిన్నా శ్రీనివాస్‌రెడ్డి విరాళంగా ఇచ్చిన రూ.30లక్షలతో బుధవారం గెస్ట్‌హౌస్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. శ్రీనివాస్‌రెడ్డి బంధువులు, ఆలయ ఈవో సదయ్య, డైరెక్టర్లు, ఎంపీటీసీ బోడకుంట చిన్నస్వామి, ప్రధాన అర్చకులు వీరభద్రయ్య పాల్గొన్నారు.

### ఇసుక ట్రాక్టర్ల అడ్డగింత



మారేడుపల్లిలో నిలిపి ఉంచిన ఇసుక ట్రాక్టర్లు

పాలకుర్తి: గోదావరి పరీవాహక ప్రాంతమైన ముర్మూర్, అంతర్గాం, గోలివాడ నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను బుధవారం బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మారేడుపల్లి గ్రామస్తులు అడ్డుకున్నారు. రోజూ రాత్రివేళల్లో ధర్మారం, వెల్గటూర్, ఎండపల్లి మండలాల పరిధిలోని గ్రామాలకు అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని, సంబంధిత ట్రాక్టర్ల డ్రైవర్లు వేగంగా, అజాగ్రత్తగా వాహనాలను నడపడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. అనంతరం ఎండపల్లి మండల తహసీల్దార్‌తోపాటు బసంత్‌నగర్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఇసుక ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించారు. అధికారులు పట్టించుకోకపోవడంతోనే మండలంలో ఇసుక మాఫియాకు అడ్డులేకుండా పోతుందని పలువురు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు రాత్రివేళల్లో గస్తీ ముమ్మరం చేసి ఇసుకదందాను నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.

### రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

గోదావరిఖని : రోడ్డు ప్రమాదంలో ఓ బాలుడు మృతిచెందిన సంఘటన గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. గోదావరిఖనిలోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన పల్లెపు శేషాద్రి పనినిమిత్తం బుధవారం తెల్లవారుజామున ద్విచక్రవాహనంపై స్నేహితుడు సాయికిరణ్‌తో మంచిర్యాలకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో గోదావరి ఖని బస్టాండ్ సమీపం వద్దకు రాగానే బయట గేటు వద్ద సిమెంటు దిమ్మెను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో శేషాద్రి, సాయికిరణ్‌కు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా శేషాద్రి మృతిచెందాడు. సాయికిరణ్ హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై స్వామి తెలిపారు.

# అయ్యో బిడ్డలారా..!

- మానేరులో ఈతకు వెళ్లి ఇద్దరు చిన్నారుల మృతి
- కళ్లముందే చనిపోవడంతో విలపించిన కుటుంబసభ్యులు
- మృతులది జమ్మికుంట మండలం తనుగుల
- ఓదెల మండలం పొత్కపల్లి వద్ద ఘటన
- వేసవి సెలవులకు వీణవంక మండలం కొండపాకకు..



విలపిస్తున్న కుటుంబ సభ్యులు





సాత్విక్, నిత్య (ఫైల్)



గాలిస్తున్న స్థానికులు

ఓదెల/వీణవంక/జమ్మికుంట: వేసవి సెలవుల కోసం బంధువుల ఇంటికి వెళ్లిన ఇద్దరు చిన్నారులు మానేరువాగులో మునిగి మృత్యువాత పడడం స్థానికంగా విషాదం నింపింది. వీణవంక మండలం కొండపాక చెక్‌డ్యాం, పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం పొత్కపల్లి చెక్‌డ్యాం సమీపంలో చోటుచేసుకున్న ఈ ఘటన మూడు గ్రామాల ప్రజలను కలచివేసింది. జమ్మికుంట మండలం తనుగులకు చెందిన జూపాక అశోక్, భాగ్యలక్ష్మికి కూతురు సింధు, సాత్విక్ (13)సంతానం. అదే గ్రామానికి చెందిన కాసర్ల సునీల్, వందనకు కూతురు నిత్య(12) కుమారుడు ధామన్ సంతానం. వేసవి సెలవుల కోసం మూడు రోజుల క్రితం కొండపాకలోని సంపత్ ఇంటికి వెళ్లారు. బుధవారం ఉదయం కొండపాక శివారులోని చెక్‌డ్యాంలో స్నానం చేద్దామని వెళ్లారు. నిత్య, సాత్విక్ ప్రమాదవశాత్తు నీటిలో మునిగారు.

**చదువులో ఇద్దరూ ముందంజ..**

సాత్విక్ తనుగుల ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి చదివి ఆరో తరగతి కోసం ఇటీవల జరిగిన సోషల్ వెల్ఫేర్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాడు. నిత్య హుజూరాబాద్‌లోని బీసీ వెల్ఫేర్‌లో ఏడో తరగతి చదువుతోంది. ఇద్దరూ చదువులో చురుగ్గా ఉండేవాళ్లని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. తహసీల్దార్ రాజయ్య, ఎస్సై శేఖర్‌రెడ్డి, బ్లూకోల్ట్స్ సిబ్బంది రాజబాబు చిన్నారుల మృతదేహాలను బయటకు తీసేందుకు కృషి చేశారు. జమ్మికుంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సంతాపం**

సాత్విక్, నిత్య మృతి చెందడంపై హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను ఆదుకుంటామని తెలిపారు. సర్వాయి పాపన్న మోకు దెబ్బ గౌడ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కే వీరస్వామిగౌడ్, సర్పంచ్ చిలుముల వసంత, ఎంపీటీసీ వాసాల నిరోష తదితరులు సంతాపం తెలిపారు.

**దేంజర్‌గా జోన్‌గా మానేరు**

పొత్కపల్లి వద్ద మానేరు వాగు డేంజర్‌జోన్‌గా మారింది. నెల రోజుల క్రితం ఇక్కడే ఓ చిన్నారి కూడా ఈతకోసం వెళ్లి ప్రాణాలు కోల్పోయాడు. తాజాగా ఇద్దరు చనిపోయారు. పొత్కపల్లి మానేరు చుట్టు గ్రామాలైన వీణవంక, కోర్కల్, కొండపాక, మడక, కనగర్తి, మల్లారెడ్డిపల్లె, కల్లుపల్లె ప్రజలు మానేరులో ఈత కొట్టేందుకు వస్తుంటారు. మానేరులో చెక్‌డ్యాంల నిర్మాణాల కోసం ఈ ప్రాంతంలో ఇసుక తవ్వకాలతో లోతైన గోతులు ఏర్పడ్డాయి. అవి నీటితో నిండిపోవడంతో చిన్నారులకు లోతు తెలియక మునిగిపోతున్నారు. మే 22న జీలకుంటలో జరిగిన భూలక్ష్మి ఉత్సవాలకు వచ్చిన వరంగల్ జిల్లా టేకుమట్ల మండలం వెన్నంపల్లి గ్రామానికి చెందిన పింగిళి సదాశివరెడ్డి(24) ఇక్కడే మృతిచెందాడు. నెల తిరగకముందే సాత్విక్, నిత్య మానేరులో మునిగి మృతిచెందారు. ప్రమాదాలు జరగకుండా మానేరు చుట్టూ రక్షణ ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

## ఉద్రిక్తత మధ్య గ్రామ దేవతల ప్రతిష్ఠ



మంగళహారతులతో వస్తున్న మహిళలు



నాయకులతో మాట్లాడుతున్న అధికారులు

ధర్మారం: మండలంలోని పత్తిపాకలో గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ఠాపన ఉద్రిక్తతల మధ్య సాగింది. బుధవారం ఉదయం వేదపండితులు సీపెల్లి బ్రహ్మం, సాయినాథం వేదమంత్రోచ్చరణల మధ్య పోచమ్మ, పోతరాజు, భూలక్ష్మి, మహాలక్ష్మి, సారలమ్మ విగ్రహాలను ప్రతిష్ఠించారు. బస్టాండ్ సమీపంలో బొడ్రాయిని ప్రతిష్ఠించేందుకు స్థానికులు గద్దె నిర్మించారు. అది అంబేడ్కర్ విగ్రహానికి సమీపంలో ఉండటంతో అంబేడ్కర్ సంఘం నాయకులు అభ్యంతరం తెలిపారు. స్థానికులు కొందరు గద్దె నిర్మించాక వద్దనడం సరికాదని ఎదురుదాడికి దిగారు. దీంతో అక్కడ కొంత గందరగోళం నెలకొంది. సమాచారం అందుకున్న ఎస్సై శ్రీనివాస్ సంఘటన స్థలానికి చేరుకుని ఇరువర్గాలను శాంతింపజేసే ప్రయత్నం చేశారు. అయినా వారు బెట్టు వీడకపోవడంతో పెద్దపల్లి, సుల్తానాబాద్ సీఐలు అనిల్, ఇంద్రసేనారెడ్డి, ధర్మారం తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో జయశీల గ్రామానికి చేరుకుని గ్రామ పెద్దలను పంచాయతీ కార్యాలయానికి పిలిపించి చర్చలు జరిపారు. అంబేడ్కర్ జయంతి నిర్వహిస్తే స్థలం సరిపోదని, అక్కడ బొడ్రాయిని ప్రతిష్ఠించవద్దని అంబేడ్కర్ సంఘం నాయకులు పట్టుపట్టారు. ఓ వైపు చర్చలు జరుగుతున్న సమయంలోనే కొందరు భక్తులు మంగళహారతులతో పోచమ్మ ఆలయం నుంచి తరలివచ్చి బొడ్రాయిని ప్రతిష్ఠించారు. తమను చర్చలకు పిలిచి విగ్రహాన్ని ప్రతిష్ఠించడంపై అధికారులు, గ్రామ పెద్దలపై అంబేడ్కర్ సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబేడ్కర్ విగ్రహం సమీపంలో గ్రామ దేవతలు ఉంటే మంచి జరుగుతుందని సంఘం నాయకులకు అధికారులు నచ్చచెప్పటంతో వివాదం సద్దుమణిగింది. సర్పంచ్ బద్దం సుజాత, పత్తిపాక సింగిల్ విండో చైర్మన్ నోముల వెంకటరెడ్డి, విండో డైరెక్టర్ బద్దం రవీందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మణ్, అంబేడ్కర్ సంఘం నాయకులు ఎదుల్ల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఓటుహక్కు వినియోగించుకోవాలి

- ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న జీఎం శ్రీనివాస్

గోదావరిఖని: సింగరేణీయులందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్, రామగుండం తహసీల్దార్ జాహిద్‌పాషా సూచించారు. బుధవారం జీఎం కార్యాలయం ఆవరణలో ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. స్పెషల్ సమ్మరీ రివిజన్–2023లో భాగంగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఓటర్ కార్డు లేనివారు, మార్పులు చేర్పులు ఉంటే ఆగస్టు రెండో తేదీలోపు ఆన్‌లైన్‌లో లేదా తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు. ఎస్‌ఓటూ జీఎం రాంమోహన్, డీజీఎం పర్సనల్ లక్ష్మీనారాయణ, అధికారులు రాంమూర్తి, ఆంజనేయులు, ఆంజనేయప్రసాద్, బండి సత్యనారాయణ, బాలసుబ్రహ్మణ్యం, శ్రీధర్, ప్రవీణ్, వీరారెడ్డి పాల్గొన్నారు.

**రక్తదానం చేసి ప్రాణాలు నిలబెట్టండి**

రక్తదానం చేసి ఆపదలో ఉన్నవారి ప్రాణాలను నిలబెట్టాలని జీఎం శ్రీనివాస్ కోరారు. రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఏరియా ఆసుపత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదానం చేసిన వారికి పండ్లు, సర్టిఫికెట్లు అందించారు. టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు గండ్ర దామోదర్‌రావు, డీవైసీఎంఓ కిరణ్‌రాజ్‌కుమార్, వైద్యులు అంబిక, విష్ణుమూర్తి, ఆసుపత్రి పిట్ సెక్రటరీ రత్నమాల, నాయకులు యాదవరెడ్డి, సంక్షేమాధికారి ఫిరోజ్‌ఖాన్ పాల్గొన్నారు.

### ఓటుహక్కు విలువైనది



ర్యాలీలో పాల్గొన్న ఆర్డీవో, విద్యార్థులు

కమాన్‌పూర్(మంథని): ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు విలువైందని మంథని ఆర్డీవో వీరబ్రహ్మచారి అన్నారు. రెవెన్యూ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో బుధవారం మంథని జేఎన్‌టీయూ కళాశాలలో (సిస్టమెటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్షన్ పార్టీ స్వెప) పై విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్జీ–3 జీఎం కార్యాయలం వద్ద విద్యార్థులతో మానవహారం నిర్వహించారు. ప్రతిఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హులైన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చెరువు శ్రీధర్ రెడ్డి, తహసీల్దార్ రామ్మోహన్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

### రక్తదానంతో ప్రాణాలు కాపాడవచ్చు



రక్తదానం చేస్తున్న సురేశ్

యైటింక్లయిన్‌కాలనీ: రక్తదానంతో ప్రాణాల్ని కాపాడవచ్చని వైకే ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కండెం సురేశ్ అన్నారు. బుధవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా 32వ సారి రక్తదానం చేసి అందరికి ఆదర్శంగా నిలిచారు. వైకే ఫౌండేషన్ సంస్థ సభ్యులు 11 ఏళ్లుగా రక్తదానం చేస్తున్నారన్నారు. ఇప్పటివరకు ఐదువేల మందికిపైగా రక్తదానం, 3,214 మందికి ప్లేట్లెట్స్, 222 ప్లాస్మా ఇచ్చి ఆపదలో ఉన్న వారిని అందుకుంటున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి రక్తదాతల వివరాలను నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

**'ధన్వంతరి'లో రక్తదాన శిబిరం**

జ్యోతినగర్: జాతీయ రక్తదాన దినోత్సవం సందర్భంగా బుధవారం ఎన్టీపీసీ ధన్వంతరి ఆస్పత్రిలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎన్టీపీసీ ఈడీ సునీల్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఎన్టీపీసీ సీఐఎస్ఎఫ్, ఉపాధ్యాయులతో పాటు పలువురు దాతలు రక్తదానం చేశారు. అనంతరం పెద్దపల్లి బ్లడ్ బ్యాంక్ వైద్యుల ఆధ్వర్యంలో 80 యూనిట్లు రక్తాన్ని సేకరించారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఈసీ మెంబర్ గుళ్ల అంజన్‌కుమార్, తదితరులు పర్యవేక్షించారు.

### యువకుడి ఆత్మహత్య

ఎలిగేడు: పురుగుల మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తుల తెలిపిన వివరాల ప్రకారం... ముప్పిరితోట గ్రామానికి చెందిన చెవుల అజయ్ బుధవారం సాయంత్రం వ్యవసాయ బావివద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా మృతికిగల కారణాలు తెలియరాలేదు. జూలపల్లి ఎస్సై వెంకటకృష్ణ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. దీనిపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై తెలిపారు.

### ఎన్నికలను అడ్డుకోవాలని చూస్తున్న యాజమాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణి గుర్తింపు ఎన్నికలను యాజమాన్యమే అడ్డుకోవాలని చూస్తోందని ఐఎఫ్టీయూ నాయకులు ఐ.కృష్ణ విమర్శించారు. బుధవారం యూనియన్ కార్యాలయంలో మాట్లాడారు. సింగరేణిలో ఎన్నికలు నిర్వహించాలని, ఒకే పరిశ్రమలో ఒకే యూనియన్ ఉండాలని ప్రచారం చేసింది తమ యూనియనే అన్నారు. జాతీయ సంఘాలు విప్లవ సంఘాలు, రిజిస్టర్డ్ సంఘాలను యాజమాన్యంతో చర్చించకుండా అడ్డుపడుతున్నాయని పేర్కొన్నారు. సింగరేణిలో రెండేళ్ల ఎన్నికల కాలపరిమితి ఉండాలని డిమాండ్ చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు నరేష్, కొమురయ్య, యూసుఫ్, బాబు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ One year 10th,inter,NIOS,TOSS, APOSS, Degree&PG, Year Wise Nagarjuna, SV University guidelines for B.Tech, Detained,Failed Students Cont: NICC KPHB Hyd. Ph: 9515390685, 8179882462 [H-788704]

REAL ESTATE

HOUSE FOR SALE

■ House for Sale: 180 Sq.yds (E/F) 30 Feet Road Near pensioners Bhavan lane, Indira nagar. Karimnagar ph: 91773 72441. Email: harithnani79@gmail.com [H-781502]

SERVICES

రేకుల షెడ్డు అమ్మబడును

■ రేకుల షెడ్డు అమ్మబడును: రేకుల షెడ్డు 50'x40' పొడవు, వెడల్పులు గల నిలువు పోల్స్, క్లైంబీలు, పైపులు, 55-TATA కొత్త రేకుల షెడ్డు అమ్మబడును. సంప్ర॥ 9573610777, 7059068888 [K- 1219894]

BUSINESS OFFER

■ ద్వారకా ఎంటర్‌ప్రైజెస్: పేపర్ ప్లేట్స్ & LED మెషిన్ పై ప్రతి నెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. ఫోన్:9310515624, 8800496710. [DA-37247]

WANTED

■ షిర్డిసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ వార్డెన్స్, ఆయాలు, భార్యా-భర్తాలు, డ్రైవర్స్,సాయి మందిరములో పుజారి కావలెను. ఫోన్ : 9391036931, 9246585901. [HA-11235]

■ Post Graduate College in Karimnagar, requires 1) Front Office Executive, 2) Accountant, 3) Librarian. Must be Post Graduate, Resident of Karimnagar, 2-5 years of relevant experience with full knowledge of Computers and English communication skills. Send updated resume with recent photo at principaljkcl@gmail.com. Contact 8500105833. [K- 1219842]

■ లేపాక్షి హెల్త్ కేర్ హైదరాబాద్ నందు వృద్ధులు, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ:18k. ఏజెంట్ కమీషన్ 6k. ఫోన్: 9640400073 [HA.284]

■ హైదరాబాద్ ఏరియాలో పనిచేయడానికి హెల్పర్స్, ప్యాకింగ్ బాయ్స్ కావలెను. చదువు లేకున్నా జాబ్. జీతం: 18 నుండి 20 వేలు వసతి కలదు. Ph: 8096309212 [H-781385]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933, 9951602824

## 'నీట్'లో అల్ఫోర్స్ విద్యార్థుల ప్రభంజనం




మార్కులు సాధించిన విద్యార్థులతో డా.నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): నీట్– 2023 ఫలితాల్లో అల్ఫోర్స్ నీట్ అకాడమీ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. జి.సంతోషిని 619 మార్కులు, డి.ఆదిత్య చంద్రకాంత్‌రెడ్డి 615, ఎస్.ధీరజ్‌కుమార్ 610, కె.ప్రణీతరెడ్డి 610, జి.జ్యోతి 600, బి.శ్రీగోధ 594, డి.అశ్వితరెడ్డి 588, సయ్యద్ అతిభవుర్ రహమాన్ 583, టి.దీపిక 571, సాయిసదిష్ట 570, కె.అలేఖ్య రెడ్డి 564, నబిహా 558, బి.విద్యాలక్ష్మీ 550, స్నేహ మాలిక్ 550, బి.ప్రణయ్ 549, రుషైఫ ఫాతిమా 537, ఎస్.అనూష 537, డి.వర్షిణి 533, సీహెచ్.పార్థివ్ ఖౌండిన్య 533, ఆర్.స్నిఖిత 529, కె.హారిక 529, ఎస్.చందన 527, సీహెచ్.శ్రీవేదార్పిత 527, శ్రేషిత 523, ముస్కాన్‌తభస్సుమ్ 521, బి.శ్రీనిధి 520, ఫాయేజాఅంజుమ్ 518, ఎ.అక్షిత 516, సాయివిఘ్నేష్ 515, ఎ.మానస 514, వి.శైలేష్ 513, ఎస్.అభినయ 511, ఎ.హరిచరణ్ 506, కె.శ్రీఫణి 505, ఎ.అద్వైతవర్షిణి 503 మార్కులతో రాణించినట్లు విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. కరీంనగర్‌లోని అల్ఫోర్స్ టైనీటాట్స్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులను అభినందించారు. ఐదుగురు 600పై మార్కులు, 36 మంది 550పై, 55 మంది 450పై మార్కులు సాధించారని, సుమారు 80 మంది విద్యార్థులు ప్రతిష్టాత్మక మెడికల్ కళాశాలల్లో సీట్లు సాధించగలరని తెలిపారు. నిరంతర కృషితోనే ఇదంతా సాధ్యమైందని వెల్లడించారు.

## సత్తాచాటిన ట్రినిటీ విద్యార్థులు




విద్యార్థులను అభినందిస్తున్న ట్రినిటీ కళాశాల యాజమాన్యం

కరీంనగర్: నీట్ ఫలితాల్లో ట్రినిటీ కళాశాలలు పెద్దపల్లి, కరీంనగర్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. టీ45 బ్యాచ్ నుంచి 20 మంది తెలంగాణ, ఇతర రాష్ట్రాల్లోని మెడికల్ కాలేజీల్లో సీట్లు సొంతం చేసుకున్నారని వివరించారు. ఫలితాల్లో ఎ.సంధ్యారాణి 628 మార్కులు, కె.ఐశ్వర్య 605 , ఎస్.కార్తికేయ 578 , టి.అవినాశ్ కుమార్ 531, ఎ.మల్లికార్జున్ 530, ఎ.మహేందర్ 527, ఎ.భార్గవి 524 , వి.అర్పిత 523 , ఎం. రేఖ 492 , ఎ.శివవర్ష 488 , హరికృష్ణ 484, ఎండీ అబ్దుల్ ముజీబ్ 478 , బి.సిరి 468 , ఆర్. వంశీకృష్ణ 466 , ఎం. నిత్య 463, బి.దీపక్ 455, ఎన్. కార్తీక్ 453 , ఆర్.అలేఖ్య 449, కె.లిఖిత 438, సీహెచ్ వైష్ణవి 430, కె.దివ్యసాయి 427, కె.కిరణ్ 427, ఎస్. మనీషా 423 , సరీశ్ బిమన్ 421 , జి.శరుస్ 421 , సుస్మితాగ్రేస్ 420, ఆర్. శైలజ 419 , వై.అశ్లేష 418, బి.నివేదిత 417, బి.దీపక్ లాల్ 412, సాయిమోక్షిత్ రెడ్డి 402 మార్కులు సాధించారు. లాంగ్ టర్మ్ బ్యాచ్ ఈనెల 14 నుంచి ప్రారంభమైనట్లు తెలిపారు. ఫలితాలు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అధ్యాపక బృందాన్ని ఫౌండర్ చైర్మన్ పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్, డీన్, అధ్యాపకులు అభినందించారు.

## శ్రీచైతన్య విద్యార్థుల హవా..




విద్యార్థులను అభినందిస్తున్న రమేశ్‌రెడ్డి, యాజమాన్యం

కరీంనగర్: నీట్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులు అద్భుత ర్యాంకులు సాధించారు. బానోతు దినేష్‌నాయక్ 425, ఆర్.హరికృష్ణ 1169, ఎస్.స్వాతి 1755తో జాతీయ ర్యాంకులు సాధించారని విద్యా సంస్థల అధినేత ఎం.రమేశ్‌రెడ్డి తెలిపారు. ఎం నందిని 609 మార్కులు, తాటి కావ్యశ్రీ 580, డి.కార్తీక్ 554,, బి.సాయివినీత్ 545, డింపుల్ జెస్టినా 541, ఎ.కీర్తన 533, సుద్దాల శ్రీనివాస్ 492, వి.అఖిల 491, మేముల శ్రీజ 466, ఎం. కృష్ణతేజ 459, ఎస్.స్వాతి 458, ఎస్.జెస్విందర్‌కౌర్ 452, పాదం యశ్వంత్ 447, కె. ఆదిత్య 445, హుస్సేన్ 438, కె.అర్జున్ 437, ఎస్.అనిల్ 437, సిహెచ్ చందన 435, కె. సాయికిరణ్ 427, వి.మధుకర్ 414, ఐ.రమణీరెడ్డి 411 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఇంటర్, ఎంసెట్, ఐఐటీ, నీట్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు అత్యున్నత ఫలితాలతో ఉత్తర తెలంగాణలో అగ్రగామిగా నిలుస్తున్నారని వివరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాలల డైరెక్టర్ కర్ర నరేందర్‌రెడ్డి, డీన్ జగన్‌మోహన్‌రెడ్డి, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, రాధాకృష్ణ, ఏజీఎం శ్రీనివాస్, అధ్యాపకులు అభినందించారు.

## రూ.2,840 అలవెన్స్ చెల్లించాలి



మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

జ్యోతినగర్: కొత్త వేతన ఒప్పందంలో భాగంగా ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికులకు అలవెన్స్ రూ.2,840 చెల్లించాలని ఎన్టీపీసీ కాంట్రాక్ట్ కార్మిక సంఘాల యునైటెడ్ ఫోరం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ప్రాజెక్టు లేబర్ గేట్ రోడ్‌లో జరిగిన సమావేశంలో యాజమాన్యంతో జరిగిన చర్చల అంశాలను కార్మికులకు వివరించారు. యాజమాన్యం నుంచి చర్చలకు వచ్చిన ప్రతినిధులు కేవలం రూ.400 నుంచి రూ.460 చెల్లిస్తామన్నారని, తాము రూ.2,900 నుంచి రూ.2,840 వరకు చెల్లిస్తేనే ఒప్పందం చేసుకుంటామని చెప్పినట్లు పేర్కొన్నారు. గత ఒప్పందంలో పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్, ప్రమోషన్ పాలసీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యునైటెడ్ ఫోరం నాయకులు నాంసాని శంకర్, చిలుక శంకర్, ఇజ్జగిరి భూమయ్య, రాధారపు రాజమల్లయ్య, సత్యం, నాగభూషణం, లక్ష్మణ్, లక్ష్మారెడ్డి, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తిరుపతి రెడ్డి



నూతన కార్యవర్గంతో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

పెద్దపల్లి రూరల్: జిల్లా రైస్ మిలర్ల సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా పల్లా మురళీధర్, అధ్యక్షుడిగా మోరపల్లి తిరుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ముస్త్యాల రాజన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కోశాధికారిగా పల్లా శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా చెలక అశోక్‌కుమార్, తిరుపతిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, వెంగళరావు, జాయింట్ సెక్రటరీలుగా శివశంకర్, వినయ్‌రావు, దీకొండ భూమేశ్, కనకయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా తిరుపతి, శ్రీరాం, అర్జున్‌రావు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన జిల్లా మిలర్ల సంఘం కార్యవర్గం ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి శాలువాతో సన్మానించారు.

### ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల నమోదు పెంచాలి



మాట్లాడుతున్న డీఈవో మాధవి

ఓదెల: ప్రభుత్వ పాఠశాలలో పిల్లల నమోదు శాతాన్ని పెంచాలని డీఈవో మాధవి పేర్కొన్నారు. బుధవారం ఓదెల మోడల్ పాఠశాలలో ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాల ప్రధానోపాధ్యాయులతో సమావేశమయ్యారు. పాఠశాలల్లో విద్యార్థులకు అమలుచేస్తున్న సౌకర్యాలను ఇంటింటా తిరిగి తల్లిదండ్రులకు వివరించాలని ఉపాధ్యాయులకు సూచించారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 20న జరిగే విద్యా దినోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మోడల్ ప్రిన్సిపాల్ జావిద్, నోడల్ అధికారులు రమేశ్, నరేంద్రచారి పాల్గొన్నారు.